
తెలంగాణా మాండలికంలో సొగసులు ప్రేమజంట సోయగాలు



# పట్నమొచ్చిన పల్లె

భూపాల్ · రేఖా నవలిక



20.9.80 శనివారం

నా పానమైన చంద్రా!

నా మీద ఎంత కోపం దెచ్చుకున్నవో! ఎంత తిట్టుకున్నవో? నిన్ను కండ్లారా సూస్తనన్న ఆశ మెరుపు లెక్క మెరిసి అప్పడే చీకటైంది. నిన్న రాత్రి నాయిన ఎకాఎకి నూస్తయ్యి జెరం బట్టుకుంది. పెయ్యి రొట్టెల పెంకోలె కాలవట్టింది. కలవరియ్య వట్టిండు, నాకు సిన్న భయంగాలె. సుట్టు పట్లున్న గొల్ల యాదమ్మ, పద్మ, వెంకటేశు, కాంతురెడ్డి ఒచ్చి ధైర్యం చెప్పి పొద్దున్నే డాక్టరును తోలుకొచ్చిండ్రు. డాక్టరు పరీక్ష జేసి మందులిచ్చి ఏం గాదన్నాడు. ఇప్పడే జెరం ఇడిసింది. బాగా చెమటవట్టి పల్లగెండు. ఇగో గిందుకే నేను రాలేకపోయిన. పదునుంటె అదును జూసి ఇత్తనాలెయ్యక రైతు మరిచినా మర్చిపోతడేమోగాని, నీకు చెప్పిన టైము నేను మరువనని నీకు తెలుసు. మనసంత ఆగమాగముంది. ఒక్కోసారి పనికి పోబుద్ది కాదు. ఇంట్ల కూసుంటె దినమెల్లేది కష్టమాయె. అంతేగాక. నీమద ధ్యాస ఇంకా తిప్పల వెడ్తది. 'అరచేత బెల్లము చిరుచేదులాయె' అన్నట్టు బువ్వదినా బుద్ది వుట్టదు. నీళ్ళు దాగుదామన్నా కుతికె జారవు. నూవు ఒక్కతాన్నే నిలవద్దా ఏమీ కనిపించనట్టే వుంటది. ఎన్ని బాధలున్నా నగుకుంటు తిరగాలెనని చెప్తుంటవి"

'రోజుకో గండము – అగ్గి గుండము గుండె'
మనసుట్టు చీకటీ – చెదురుతుందంటవా?
ఏదో పాట ఇట్లా మీదికొస్తుంది.

చంద్రం! నీకు ఉత్తరం రాసిన మరునాడనుకుంట మీ అక్క మా ఇంటికొచ్చింది. చాలసేపు కూసుంది. మీ నాయిన సంగతీ, ఆయన కుండిన కావాలి తను, చేసిన పన్లన్నీ చెప్పింది. పటేండ్లు తాగుడెట్ల నేర్పింది. ఆఖరికి తాగుడుకే ఆయనను బానిసను చేసి నువ్వు యాడాది వర్గమున్నప్పుడు బాయిల నూకిచ్చి సంపిపిచ్చిందీ చెప్పింది. రెండు వేల రూపాల కింద అప్పకాయిదం జూపి ఇనాం భూమి రాపిచ్చుకొని దొంగ సంతకాలు దీస్కున్నదీ, ఆ భూమి ఇప్పడెవ్వరు చేసుకుంటున్నదీ చెప్పింది. జరిగిన ముచ్చట్లు అక్క చెపుతుంటేనా పెయ్యంత ముండ్లు పొడిసినయ్. ఎంత అన్యాయం జేసిండ్రూ! ఎన్ని తీర్ల నాకు కీడు జరిగిందో చెప్పలేను. ఏదిఏమైనా మల్ల మన భూమి మనం కొట్లాడి తీసుకోవాలె.

ఇక ఊరి ముచ్చట్లా! మొన్న పొద్దున జూసిన సంగతి నీకు రాయకుంట మనసుండనిస్తలేదు. మనసు ఇప్పకునేది మనసున్న మనిషి దెగ్గర్నే గద! ఈ కండ్లకు కనిపిస్తున్న కథలు కొంతల కొంత కాలాన్ని ముంగటికి నడుపుతున్నయ్. ఆమల్ల సన్నటి ముసురు. సల్లగ దవగాలి. ఇల్లంత కురుస్తుంది. కురిసె తావుల్ల చెంబులూ, బగోనెలూ పెట్టిన జెరసేపటికోసారి టప్ప టప్ప నీళ్ళ సుక్కలు వస్తున్న సప్పడు. నాకు పోయికాడికెల్లి లేవబుద్దైతలేదు. నాయినకు తొట్టెల నింగల మేసిచ్చిన మట్ట దాక్కుంట కస్స కస్స దగ్గుకుంట ఆయన దాండ్లనే ఊంచుతుండు. బైట ఎవరో పిలిసిన సప్పడైంది ఎల్లి సూస్తె యాదిరెడ్డి టమాట లేర రమ్మని పిలుస్తుందు కొచ్చిండు. "ఈ ముసుర్లనా?" అనడిగితె "రేపు దెంపితే అవి సేతికే రావట ఎట్లైనా తెంపి ఇయ్యాల్నే మందికి పంపాలె" నంటడు. మొకం జూసిన యాల్లగునం తప్పెటట్లలేదని ఏట్నో పది మంది కూలోల్లం జమైనం. రొండు రోజుల సంది హనుమంల్ల పెంటమ్మ కూలి కొస్తలేదు. పోత పోత గుడిసె దిక్కు తొంగి చూసిన. పెంటమ్మ ఒక మూలకు, దాని అత్త ముత్తవ్వ ఒక దిక్కు మూలుగుకుంట పండుకుండ్రు. పెంటమ్మ దగ్గర కూసొని ఏడేండ్ల కొడుకు ఎల్లయ్య ఏడుస్తుండు. అని సెల్లె నాలుగేండ్లది గుడిసె కమ్మల పొంటి జారె నీటి దారల తోటి ఆడుకుంటుంది. 'ఏం రా! పనుల పడిపలే నువ్వు? అమ్మకేమైంది?" ఆడిగిన.

పెంటమ్మ సలికి గజ గజవొణుకుతుంది. కప్పుకున్న గోనె తాటు సినిగిపొయ్యింది. అది కాళ్ళకు జాస్తె నెత్తికి జాల్తలేదు. దాని గుడ్లల్ల పానముంది. పెయ్యి బట్టోలెగాలుతుంది. ఇంకో దిక్కు ముసల్ది బొర్ల బొక్కల పడి వుంది. చివిగిన సీరె బట్టంత లేసిపొయ్యింది. కట్టెల లెక్క,

కాళ్ళు, మోకాలు సిప్పమీద తోలు దప్ప ఇంకేం లేదు. అది సచ్చిందా అన్న అనుమానం తోటి "ముత్తీ! ముత్తవ్వా?" అని పిల్చిన. "ఊ" అంట మూల్గింది. దమ్మాడుతున్నట్టుంది. ఇద్దరూ మాట్లాడెటట్టు లేరు.

"ఏంరా ఏమైంది? అట్ల గూసున్నవేంది?" ఎల్లిగాన్నే అడిగిన.

"పనుల నిడవకపోతే పటేలు కొడ్తడు. నిన్నటి సంది గంజి దాగలె. రొట్టె దినలె. ఆకలైతుంది. అమ్మలేవుమంటెలేస్తలేదు."

ఇక నేనేం మాట్లాడక "ఇగరా" అని పిలుసుక పొయ్యి రొండు రొట్టెలూ ఇంత శింతకాయ తొక్కే సిన, జెరంత గంజిల నాతటి మాకల బువ్వుంటె 'ఏసి బగోనె శిన్నెల పోసి' ఇది మీ అమ్మకు అవ్వకు దాపి నువ్వు పనుల నిడువుపో! రొట్టె దినుకుంట ఉర్కు. సెల్లెకు నగమియ్యి" అని జెప్తె ఆడు తోప్కొని ఒకటే ఉర్కుదీసిండు.

నేను కూలోల్లకు కలెపోయిన అప్పటికే ఆళ్ళు "మనుమోతు బాయి' దాటిండ్రు.

నీకు తెలిసే వుండొచ్చు. ముత్తి మొగడు హనుమంల్ల నత్తయ్య తన కొడుకు జంగని కోసం పెండ్లికి పెద్ద పటేలు దెగ్గర ఐదుమార్లు అప్ప జేసిండట. అప్ప దీర్చలేదు. ఆడూ కాలం జేసె. అని జీవుల జంగడు జీతం గుదిరె. ఎట్లనో తిప్పలవడి అప్పదీర్చి బైట బతుకుదామనేటాల్లకు అంగడికెల్లి కొట్కొన్తున్న పటేలు కొత్త కోడే పొడిస్తే ఆడు రొండు వారాలు నవుశి నవుశి సచ్చెనప్పడే పటేల్ని బతిలాడి సిన్నోడైన ఎల్లయ్య ఈడోళ్లు పనుల గాస్త లేరా అని ఈ పోరన్ని పనుల కాదుంచింది పెంటమ్మ. అత్తకు కండ్లు పొద్దూకితే కానరాకుం టినై. పెంటమ్మ చేసిన కూళ్ళు, పోరగాని కుండెడి జీతం మీదనే బతుకుడాయె. ఐనా ముత్తవ్వ తల్లా రగట్ల మెల్లగ లేపి అనంతరెడ్డి పటేలు ఇల్లండ్ల ముంగట ఆకితాకి వొస్తది.

ఆ రోజు పొద్దూకంగ బువ్వ, కూర వొండి పెట్టి మల్ల పెంటమ్మ ఇంటికిపోయిన. అప్పడే లేపి గోడ కొరిగిందది. పొద్దున పంపిన గంజి సగం అట్లనే వుంది. ముసలిదైతే పొద్దున జూసినట్టే పండుకొనుంది.

"ఏమైంది ముసలామె కడుపు నొప్పా?" అడిగిన.

అప్పడు శాతనై, శాతగాక చెప్పింది. మూడు రోజుల సంది తనకేమొ జెరమట. ఇంట్ల జొన్న గింజలు, మాకలు ఏం లేవట. పోరలెమొ ఆకలైతుందని ఏడుపు. నిన్న పొద్దున పటేలింటి కాడ ఆకిలూక నద్ది బువ్వొ, రొట్టో ఎయ్యమని పటేలమ్మ నడిగిందట. పోరలకు తిండిలేదనీ చెప్పిందట. పటేలమ్మ నమ్మలే "మీరు గట్లనే మాట్లాడ్తరని" "కుక్కకే కావాలె రొట్టె నీ కేస్తె మల్లెవరు జెయ్యాలె" అన్నదట. ముత్తవ్వకు ఏడ్పు ముంచుకొచ్చి బైటికొచ్చి కూసుందట. జెరసేపై నంక పటేలమ్మ కుక్కకు రొట్టెయ్యంగనే దాని దెగ్గెరి కెల్లి రొట్టె ఇది అందుకుంది. కుక్క మొరిగింది. పటేలమ్మ పట్నం మనువడు ఒచ్చి" నా కుక్క దెగ్గెరి కెళ్లి రొట్టె దీస్తావె దొంగముండ" అనుకుంట దొక్కల తన్నిండట. ఆడనే కుప్పకూలింది. ఇంకా జెరసేపు నంటె పటేలమ్మ వొచ్చి శీపురందుకుంట దని మెల్లగ లేపి ఏడ్చుకుంట బయట తుమ్మ చెట్టుకింద ఒలిశంత సేపు పండుకొని లేసొచ్చి గుడిసెల వడ్డది. అంతే నొప్పింకా తక్వకాలె.

ఇగచెప్పు! ఈళ్ళను ఎట్ల బతుకుమంటవ్? ఆ పిల్లల గతేం గావాలె? ఆళ్ళు సూసి కాపాడెటోళ్ళెవ్వరు? ఆకలికి మాడి సావాలెనా? ఆళ్ళకు జరిగిన అన్యాయానికి నిలదీసి అడిగెటోళ్ళెవ్వరు? ఆళ్ళు ఏడికిపోయి ఫిర్యాదు జెయ్యాలె? ప్రభుత్వం ఇవ్వన్ని సూస్తదా చెప్పు? నువ్వేమంటవో నాకు తెలుసు. 'ప్రజలంత ఒక్కటి గావాలె, సంఘాలు పెట్టాలె, పార్టీ గట్టి, పార్టీ జెండ కింద వీళ్ళ అంతు జూడాలె'నంటవు.

పార్టీలు లేవా ఉన్నయి. నాకు బుద్ధి తెలిసిన కాడికెళ్ళి జూస్తున్న. ప్రజలపార్టీ అని పెట్టి జై కొట్టి జెండాలు పట్కొని ఊరేగుతున్నరు. ఆ పార్టీలల్లనే ఈ పటేండ్లు దొరలు మెంబర్లు. చందాలిచ్చి, కులం, మతం పేర్లు జెవు ఈళ్ళేముంగటుంటరు. కంచె చేను మేసినంక ఇంక అడిగెటోళ్ళెవ్వరు? పార్టీలు మస్తుగున్నయ్?

చంద్రా! అన్నానికి అరమరలేదు గాని

గంజికే కటకటుంది.

ఆఖరి ముచ్చట! కొంతమందిమి కలిసి మన ఊరిలున్న బంజర్ల, పోరంబోకుల ఇవరాలన్నీ తీస్తున్నం. ఎవరి భూమి ఎవరు ఆద్రగనంగ దున్నుతున్నతో తెలుస్తున్నది.

ఇగ ఉంటమరి.

దబ్బున ఉత్తరం రాస్తవ్‌గా

నీ

వసంత

20.9.80

